# అనగనగా... ఒక కథ

## అన్నపూర్ణ చెప్పిన కథ

**నాకు చిలకాకుపచ్చ రంగు పట్టుచీర కొనాలని మా ఆయనకి మా పెళ్లయినప్పట్నించీ కోరిక.**

జీతాల్తో బాటు జీవితాలు ముడివడి వీడని చిక్కుముడిగా బిగిసిపోతుండగా ముప్ఫై ఏళ్లు గడిపేశాం. చిలకాకుపచ్చ పట్టుచీర పెళ్లినాడు కొందామంటే... అమ్మానాన్నలకి మొహమాటం వల్ల చెప్పలేకపోయారుట! పోనీ మా పుట్టింటి వాళ్లతోనైనా ఆ ముచ్చట తీర్పించుకుందామనుకున్నా... ఆ ఇంట్లో అడుగెట్టే అర్హత నాకు లేదు. మా పెళ్లే వాళ్లకిష్టంలేదు. నేను పెళ్లి చేసుకున్న రోజునే..మైలస్నానం చేసి, నాకు నీళ్లొదిలేశారట! ఇంకా ఇంటికీ నాకూ ఋణం తీరిపోయింది.

# చిలకాకుపచ్చరంగు చీర

ఐదు కాన్పుల్లో...ముగ్గురు పిల్లలు బతికి బట్టకట్టేటప్పటికి, ఆయన చేయాల్సొచ్చిన అప్పులు చిల్లు జేబుల్లోంచి గుబాల్లోకి వచ్చాయి.

ఎలాగో పిల్లల్ని చదివించి పెద్ద చేసుకొస్తున్నాం.

పెద్దాడు ఉద్యోగానికి వెళ్తున్నప్పుడు నోరు తెరచి వాళ్ల నాన్నే అడిగారు. "ఒరే మొదటి నెల జీతం ఏం చేద్దామనుకుంటున్నావురా" అని.

"నిజం చెప్పమంటావా...అమ్మకి చీర కొందామనుకుంటున్నాను నాన్నా" అన్నాడు వాడు.

నేను వంటగదిలోంచి వింటున్నాను.

ఆయనకి కన్నీళ్లు తిరగటం నాకు తెలియకపోలేదు. కొంచెంసేపు మాట్లాడలేకపోయారు.

నాకు కూడా గర్వంగా అనిపించింది. 'దొంగ వెధవ! నీకూ అమ్మకీ బట్టలు కొందామనుకుంటున్నాను నాన్నా... అనొచ్చుగా' అని అందామను కున్నా కానీ అనలేదు. మాతృగర్వం, పుత్రోత్సాహం నాది. నాకూ ఆనంద బాష్పాలు కమ్మాయి. చెవులు వినిపిస్తున్నాయి.

"ఆపై నెల జీతంతో నీకు పేంటూ షర్టూ కొందామనీ" మొహమాటంగా చెప్తున్నాడు పెద్దాడు.

"సరేలే. అది నీ ఇష్టం కానీ ...మీ అమ్మకి చిలకాకుపచ్చరంగు చీర కొనరా. ఆ రంగంటే దానికిష్టం" అంటున్నారాయన.

"అన్నీ అబద్ధాలు. ఆయనకే ఆ రంగంటే ఇష్టంరా..." అని ముందుకొచ్చి చెబుదామనుకున్నాను కానీ సిగ్గేసింది. పిల్లాడి దగ్గర అలా చెప్పడానికి చిన్న తనంగా ఉంటుందని ఊరుకున్నాను.

వాడు తర్వాత మా ఇద్దరి కాళ్లకీ దణ్ణం పెట్టుకుని బయల్దేరాడు.

## రాము చెప్పిన కథ

నేను ఆఫీసులో జాయినయ్యాను. స్టాఫ్ అందరూ నన్ను ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నారు. సౌభాగ్యలక్ష్మిగారు మాకు సీనియర్. నాకు అక్కయ్య ఉంటే ఆవిడలాగే ఉండేదా అనిపిస్తోంది. నిజంగా నన్ను చాలా అభిమా నంగా చూసుకుంటోంది. నాకు వాళ్లింటి దగ్గరలోనే రూమ్ చూసిపెట్టింది. ఇంటి ఓనర్ రెణ్నెళ్ల అడ్వాన్స్ ఇమ్మన్నాడు. ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకున్న డబ్బు దానికే సరిపోయింది. ఆ విషయం తెలుసుకుని అడక్కుండా అప్పు ఇచ్చింది. మా ఇద్దరికీ కల్సి లంచ్ బాక్స్ తెచ్చేది. "మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ చేయడం అవలేదు. కాంటీన్కెళ్దాంరా" అని నా కోసం తిననట్లు నటించేది. తినినట్లూ నటించేది. ఆమె ప్రేమాభిమానాలు చూస్తే...అమ్మ నాకో అక్కని ఇచ్చింది అనిపించేది. ఓ రోజు ధైర్యం చేసి "మిమ్మల్ని అక్కా అని పిలవనా మేడమ్" అన్నాను.

"అక్కని...మిమ్మల్నీ...మీరూ - మేడమ్ - గారూ - అనర్రా రామం" అంది. ఆవిడ మాటలో అంతరార్థం నాకు అర్థమైంది. నేను గౌరవవాచకాలు అన్నీ మానేసి 'అక్కా' అనే పిలుస్తున్నానప్పట్నించీ. అక్కయ్య కూడా ఈ తమ్ముడు దొరికినందుకు బ్రహ్మానంద పడిపోతుంది.

నాలుగు నెలల జీతం అందుకునేదాకా...నేనో నెల జీతం పూర్తిగా అందు కున్నట్లవ్వలేదు. వచ్చిన డబ్బులు వచ్చినట్లే అప్పులకీ సొప్పులకీ ఎడ్జెస్టయి పోయింది.

నాలుగో నెల జీతం అందుకోగానే నాకు గుర్తొచ్చిన మొదటి ఖర్చు...అమ్మకి చీర.. చిలకాకుపచ్చ రంగు చీర.

అక్కయ్య చేతిలో డబ్బులు పెట్టాను. చిలకాకుపచ్చ రంగు పట్టు చీర కొనాలన్నాను.

## సౌభాగ్యలక్ష్మి చెప్పిన కథ

పట్టుచీర ఖరీదు ఎంతుంటుందో తెలియదు పిచ్చాడికి. అర్థమయ్యేట్లు చెప్పడానికి నవ్వాపుకోవాల్సి వచ్చింది. రామం చాలా డిసప్పాయింట్ అయ్యాడు. "పోన్లే రామం...మిగిలిన డబ్బులు నేను అప్పిస్తాను. అమ్మకి పట్టుచీర కొనేద్దాం" ఓదార్పుగా అన్నాను.

"వద్దు. అప్పు చేసి కొంటే అమ్మ ఆనందించదు. స్వంత సంపాదనతో కొంటేనే అమ్మకి నచ్చుతుంది. నాకూ తృప్తిగా ఉంటుంది" అన్నాడు రామం.

"అక్కని...మిమ్మల్నీ...మీరూ - మేడమ్ - గారూ - అనర్రా రామం" అంది. ఆవిడ మాటలో అంతరార్థం నాకు అర్థమైంది. నేను గౌరవవాచకాలు అన్నీ మానేసి 'అక్కా' అనే పిలుస్తున్నానప్పట్నించీ. అక్కయ్య కూడా ఈ తమ్ముడు దొరికినందుకు బ్రహ్మానంద పడిపోతుంది.

రామం చెప్పింది కరెక్టే. ఇద్దరం బజారుకెళ్లాం. అతను కోరుకున్న 'చిలకాకుపచ్చ రంగు చీర' తన బడ్జెట్‌లో తీసుకున్నాం. పట్టు చీర కాక పోయినా మంచి క్వాలిటీయే దొరికింది. ఆ నెలలో శని, ఆది, సోమ వరుసగా మూడు రోజుల సెలవులొచ్చాయి. అప్పుడు ఊరెళ్తానన్నాడు రామం. 'సరే' అన్నాను.

శుక్రవారం రాత్రి ట్రైన్‌కి వెళ్లాలని అనుకుంటూండగా, ఆ రోజే రామం ఇంటి నుండి ఫోను వచ్చింది. రామం సీట్లో లేడు. 'విషయం' చెప్పమని అడిగాను. నేను షాక్ అయిపోయా.

"అలాగే చెప్తా"నని ఫోన్ పెట్టేశా.

రామం వచ్చాడు. ఇంటికెళ్తున్న ఆనందంలో మొహం వెలిగిపోతోంది. కొంచెంసేపటికి నేను నిర్ణయం తీసుకుని... "రామం నేను కూడా వస్తానా నీతో..." అన్నాను.



రామం స్టన్ అయ్యాడు. "నిజమా అక్కా..." థ్రిల్ అవుతూ అడిగాడు.

"అవును. అక్కా అన్నావు. అమ్మనీ...నాన్ననీ...ఒకసారైనా చూడొద్దా మరీ.." అన్నాను.

రామం ఆనందానికి అవధులులేవు.

ఇద్దరం బస్సెక్కి, వాళ్లూరు వెళ్లేప్పటికి తెలతెలవారుతోంది. వాళ్లింటి ముందు కొద్దిపాటి జనం గుమిగూడి ఉన్నారు. జనాన్ని తోసుకెళ్లిన రామం తండ్రి శవం మీద పడి భోరున ఏడ్చాడు. అన్నపూర్ణ కొడుకుని పట్టుకుని పెద్ద పెట్టున రోధించింది... "మీ నాన్న వెళ్లిపోయాడ్రా నాన్నా...ఫ్యాక్టరీ కోసం రక్త మాంసాలు ధారపోసి ... అక్కడే...ప్రాణం కూడా..." అమెని ఆపలేం.

పనిచేస్తుండగానే హఠాత్తుగా కుప్పకూలిపోయాడట. వెంటనే ప్రాణం పోయిందట. ఎవరెవరో చెపుతున్నారు. పది రోజులు సెలవు పొడిగించి, వీళ్ల తోనే ఉండిపోయాను.

ఈమధ్యలో అమ్మ తాను ధైర్యం తెచ్చుకుని పిల్లలకి ధైర్యం చెప్పేందుకు సిద్ధమైంది.

కర్మకాండ యధావిధిగా నడిపించారు. దూర దూర చుట్టాలంతా వచ్చారు. ఆవిడకి తెల్లచీర కట్టి...బొట్టు చెరిపి...వైధవ్య వేషం వేయించాలని ఉబలాటపడ్డారు.

రామం, నేనూ ఆ దురాచారాన్ని తీవ్రంగా ప్రతిఘటించాం.

"ఆవిడ ఈ రోజునుంచీ కేవలం చిలకాకుపచ్చరంగు చీరలే కడుతుంది" అన్నాడు జనాంతికంగా. రామం చుట్టాలందరూ వాళ్ల చెంపలు వాళ్లే బాదుకున్నారు.

అన్నపూర్ణకి కళ్లల్లో పొంగిన ఆనందానికో, దుఃఖానికో సాక్ష్యంగా కన్నీళ్లు కట్టలు దాటి బైటకొచ్చాయి.

చిలకాకుపచ్చ రంగు చీర అమ్మ చేతిలో నేనే పెట్టాను....కట్టుకోమని కోరుకుంటూ. ఆవిడ అందుకుంది.. రామం కళ్లల్లో తృప్తిని చూడాలని ప్రయత్నిస్తూ- ఇద్దరి కళ్లకీ నీళ్లు అడ్డం.

*